# రసఝురీయోగం

## - జయప్రభ

అప్పటికి రెండోవాయ చంద్రకాంతాలు నూనెలో వేస్తూ ... గుంభనంగా నవ్వునాపుకుంటూ ''అలాగే జరిగింది'' అనింది నాతో అమ్మమ్మ నా ప్రశ్నలన్నింటికీ జవాబుగా! నాకయితే అంత ముచ్చటగా చెప్పిన అమ్మమ్మని మెడచుట్టూ చేయివేసి ఒక్కసారిగా కావలించుకోవాలన్పించింది గానీ ... ఇప్పటికీ మామూలుగా మధ్యాహ్నంవేళ పలహారాలు తయారుచేస్తున్నాసరే... మడిగట్టుకుని చేసి తొలివాయ దేవుడికి నైవేద్యం పెట్టేగాని అమ్మమ్మ తనని ముట్టుకోనివ్వదు. ఈ విషయంలో మాత్రం రూల్సు దాటడానికి వీల్లేదన్న విషయం బాగా తెలిసినదానినే గనక నా కోరికని అలా అర్థాంతరంగానే ఆపుకుని మళ్ళీ సంభాషణని పొడిగించాను. ''అయితే అమ్మమ్మా! నీ మనసుకి కష్టం కలిగేదికాదా?'' అన్నాను. మా సంభాషణ అంతా తాతయ్య నడివయసులో నడిపిన శృంగార కలాపాల గురించి నడుస్తోంది.

తాతయ్యకి ఇతర స్త్రీలతోడి సంబంధాలని గురించి అమ్మమ్మ అంత సాధారణంగా ఎలా మాట్లాడగలుగుతోందో నాకు ఆశ్చర్యంగా వుంది. ఇంక వుండబట్టలేక ''అమ్మమ్మా! ఇవాళ నీ వయసు మళ్ళినప్పటి సంగతివేరు. ఆనాటికి నువ్వు చిన్నదానివేకదా! నీకు తాతయ్యకున్న ఇతర సంబంధాల గురించి కష్టమే కలగలేదంటే నాకు నమ్మబుద్ధి కావడంలేదు'' అన్నాన్నేను రెట్టించి.

అమ్మమ్మకి నాకూ మధ్య వున్న నలభై ఏళ్ళ వ్యత్యాసం మా స్నేహానికి ఏనాడూ అడ్డురాకపోవడం వింతగా వుంటుందేమోగానీ మా అమ్మమ్మ నాకు మంచి స్నేహితురాలు.

''కష్టమా కాదా అన్నది ఆ ఇద్దరి మధ్య వుండే ఆకర్షణమీదా... అవసరంమీదా ఆధారపడి వుంటుందే అమ్మాయీ...'' అంది అమ్మమ్మ. ''మీ తాతయ్యకీ నాకూ అలాంటి అవసరం అంత బలంగా ఆనాడు కలిగిందిలేదు.''

ఈ మాట అంటున్నప్పుడు అమ్మమ్మ గొంతులో ఏ కాస్త తడ బాటూ లేదు. వేదనా లేదు. నిరాశా నిర్లిప్తతా కూడా లేవు. అమ్మమ్మ చాలా స్పష్టంగా మాట్లాడిన ప్రతీమాటనీ అత్యంత ఆసక్తితో విన్నాన్నేను.

''అది అలా జరిగింది మరి'' అంది అమ్మమ్మ. ''నాకు పెళ్ళయ్యే నాటికే మీ తాత బహిరంగంగానే మాలక్ష్మి ఇంటికి వెళ్ళివస్తుండేవారు. ఆయన కులాసాపురుషుడని ఆనోటా ఈనోటా విన్నా మావాళ్ళు



దాన్నంత గణనలోకి తీసుకోలేదు. నాకప్పటికి పధ్నాలుగేళ్లు. ఏ విషయమూ తెలిసీ తెలియని వయసు. వంటినిండా అణకువా... బయమూ వుండేవి తప్ప దేనిగురించీ ప్రశ్నలే తలెత్తేవికావు. పైగా నా లోకమంతా సత్కావ్యమయం!'' అంటూ కాసేపాగింది అమ్మమ్మ.

''మరి తాతయ్యో?'' అన్నాన్నేను.

''మీ తాతయ్యకేవీ?! పరమ లౌకికుడు. నాలాకాక పుస్తకాల అవసరం

దాటినవాడూనూ'' అంది హాస్యంగా.


అమ్మమ్మని తిరిగి సంభాషణలోకి మళ్ళించడంలో ఏమాత్రమూ ఏమరిపాటు చూపలేదు నేను. అందువల్ల అవీ ఇవీ మాట్లాడి జారిపోకుండానూ, అమ్మమ్మ దారిమళ్ళ కుండానూ నా ప్రశ్నలతో కాచు కుంటూ వచ్చాను నేను. నన్ను నిరాశపరచకుండా నా సందేహాలన్నీ తీరుస్తూ అమ్మమ్మ మాట్లా డింది.

''నేను పుష్పవతినయ్యాకా కాపురానికైతే వచ్చానుగానీ... మరీ చిన్నదాన్ని. ఆటపాటలమీద వున్నంత శ్రద్ధ నాకు ఆయనమీద వుండేదికాదు. ఆయనకూడా అప్పట్లో నన్ను చిన్నపిల్లగానే చూశారు. అదీగాక మా మధ్య వయసుతేడా చాలా వుంది. మీ తాతయ్య నాకన్నా పదిహేనేళ్ళు పెద్ద. పురుళ్లకనీ పుణ్యాలకనీ నేనెక్కువ పుట్టింట్లోనే వుండేదాన్ని. పైగా మా ఇంట నేనొక్కతినే ఆడపిల్లని. ఎంతసేపూ మా జట్టుపిల్లలతో ఏటిదాకాపోయి తోట్లంటా దొడ్లంటా తిరగడం, ఏటిలో ఈతలుకొట్టడం, అప్పుడ్రావుడి కన్నుగప్పి తోటలో చొరబడి మామిడికాయలు కోసుకోడం ఈ పన్లంటే చాలు మనసు ఉరకలేసేది నాకు. మరికాస్త పెరిగాకా ఆరోజుల్లో నా మనసునెక్కువ నాకర్షించినవి సంస్కృతకావ్యాలూ, నాటకాలూనూ!!''

''నీకు తెలుసుకదా! మా పుట్టింట అంతా సురభారతీ సేవకులే! మా ముత్తాతలు, తాతలూ సంస్కృతపండితులు. కావ్య తర్క వ్యాకరణా లలో రచ్చగెలిచి ఔనన్పించుకున్నవాళ్ళూనూ! మా ముత్తాతగారు వీధి సావిట్లో వాలుకుర్చీలో కూర్చుని కళ్ళుమూసుకుని అలా శిష్యులు వల్లె వేసే శ్లోకాలవైపూ సూత్రాలవైపూ ఒక చెవివేసి వింటూ తలపంకిస్తూ వుంటే ఆయన ఎదురుగా అప్పటికే తలనెరిసిన మా తాతాగార్లందరూ ఆయన ముందు చాలా వినయంతో మసలటం నాకింకా జ్ఞాపకం వుంది. సంస్కృతనాటకాలని మా చినతాతగారు పాఠం చెబుతూ వుంటే వినడం ఎంత బాగుండేదనీ!! అందరూ కాళిదాసు శకుంతల అంటారుగానీ... నాకు శూద్రకుడి వసంతసేనమీదనే ఎక్కువ మక్కువ ఏర్పడింది''2.

మా నాయనమ్మ చాలా శ్రావ్యంగా అష్టపదులు మొదలుకొని, తరం గాలనించి, ఆధ్యాత్మ రామాయణం దాకా తన్మయత్వంతో పాడుతూ వుండేది. ''అచ్యుత మాధవహరి రామేతి కృష్ణానంద పరేతి'' అంటూ పాడుతూ కళ్ళుమూసుకుని తన గాత్ర మాధుర్యంలో తానే లీనమయ్యే నాయనమ్మ ముఖం ఇప్పటికీ నా కళ్ళలో కదలాడుతుంది. నాయనమ్మ పాటతో పెరిగినదాన్ని నేను. ''జయదేవుడంటే ఎంతో అనురక్తి ఏర్పడింది నాలో! నన్ను నేను వసంతసేనగానూ, గోపికగానూ భావించుకునేదాన్ని. ఎంతచక్కగా అలంకరించుకునేదాన్నో తెలుసా?'' సంతోషంగా అంది అమ్మమ్మ.

అటూ ఇటూ కదులుతూ, పనిచేస్తూ ఇలా మాట్లాడుతున్న అమ్మమ్మని గమనిస్తున్నాను నేను. అమ్మమ్మ అందం వాసితగ్గలేదిప్పటికీ! సన్నగా పొడవుగా కంచుకడ్డీలా వుంటుంది అమ్మమ్మ శరీరం. పట్టుచీరని అడ్డకచ్చ కట్టుకుని తనువంతా పసుపు రాశిపోసినట్టు పచ్చగా వుంటుంది అమ్మమ్మ. నిత్యమూ పసుపుతో విరాజిల్లే అమ్మమ్మ పాదాలని కప్పుతూ వెండికడియాలూ...వెండిగొలుసులూ, అమ్మమ్మ కంఠానికి అతుక్కుని బంగారు నానూ, పట్టెడా, మంగళసూత్రం, నల్లపూసల కుత్తిగంటూ, చేతులకి బంగారుగాజులూ, వాటిమధ్య ఎర్రటి మట్టిగాజులూ ఆవిడ




శరీరంలో ఒక భాగమైనట్టుగా మెరుస్తూ వుంటాయి. నెరసిన బారెడు పొడవైన తన తలవెంట్రుకలని జారుముడి వేసుకుంటుంది. ముడి మధ్యలో ఎర్రటి ముద్దమందారపువ్వుని ఎప్పుడూ వాడకుండా చూసు కుంటుంది. ఆవిడ తన ఆకర్ణాంత నేత్రాలనలా భావస్ఫోరకంగా కదుపుతూ వుంటేనూ... అటూ ఇటూ తలతిప్పుతూ మాట్లాడుతున్న ప్పుడల్లా ఆవిడ ముక్కున పుష్యరాగపొడితో తళుక్కుమంటూండే ఆ నిమ్మగుత్తి ముక్కుపుడక మీద కిరణాలుపడి చెదిరిపోతుంటేనూ... విశాలమైన ఆవిడ నుదిటిమీద ఎర్రటి కుంకంబొట్టూ, కళ్ళకి కాటుకా, తాంబూలంతో పండిన ఆ పలచటి పెదాలూ...గడ్డంకింద సదా ఎండిన గంధపుచారా ... తన ఒక్క శరీరంలో ఇంత వైవిధ్యాన్ని ఆవిడ ఎలా నిలుపుకుందో ఎప్పుడూ నాకు ఆశ్చర్యమే!! ఆవిడ రూపాన్ని అలా గమనిస్తూ వుండగా శరీరమంతా నిండిన పసుపు ఎరుపుల మిశ్రవర్ణాలతో ఆవిడ నిజంగా కుందనపు ఆకాశాన పొద్దుపొడుపు సూర్యుడిలా కన్పించింది. అలా ఆవిడని చూస్తూ 'ధన్యోస్మి' అనుకున్నాను.


మా అమ్మమ్మది చాలా అందమైన నవ్వు. ఎంత అందమైన నవ్వంటే... నవ్వుతూ ఆవిడ మాట్లాడుతూ వుంటే, ఆవిడ ముఖం మీంచి చూపుతిప్పుకోవటం కష్టం. ధనస్సు వొంగినట్టుగా మెలికలు తిరిగిన పెదాలమధ్యనించి అలవోకగా... చంద్రవంకలా...నవ్వగలదావిడ! ఆవిడ నవ్వొకటి చాలు కదా! ఆనాటి మగవాళ్ళు తమ చూపు తిప్పుకోలేక పోవడానికి అనుకుని, ఆమాటే అడిగాను అమ్మమ్మని.

దానికావిడ ముసిముసిగా నవ్వి, మాట దాటవేసి - ''ఎలా వుండే దాన్నా? అచ్చం నీలాగే వుండేదాన్ని. ఆ ఎడంబుగ్గమీద నవ్వినప్పుడు పడే సొట్టతో సహా!'' అంది నావైపు మురిపెంగా చూస్తూ!!... తన కను కొలుకుల్లో కొంటెదనాలని కూడా మేళవించి మరీ!!

''అయితే అమ్మమ్మా! మాలక్ష్మిని చూసేవా నువ్వు?'' అన్నాను.

''అయ్యో! చూడకేం! చామనఛాయ అన్నమాటేగానీ చూడచక్కనిది తెలుసా!'' అంది అమ్మమ్మ. ''మంచి పాటగత్తె అది. ఎంతటివాళ్ళుగాని మాలక్ష్మి పాడితేచాలు మైమరిచిపోవలసిందే'' అని నిశ్శబ్దంగా ఊరు కుంది కాసేపు. అప్పటికే చనిపోయిన మాలక్ష్మిని తలుచుకుని కాబోలు అమ్మమ్మ కళ్ళు తడిఅయ్యాయి. కాసేపయ్యాక ఆలోచనల్లోంచి తేరు కుని ''మాలక్ష్మి చాలా చక్కనిది కమలా!'' అని మళ్ళీ అంది అమ్మమ్మ.

ఆవిడ గొంతులో తన మొగుడు వలచిన ఆ మరో ఆడది తనకి




ధీటైనదేగానీ, ఏమంత అల్లాటప్పా మనిషికాదు సుమా అన్న కించిత్ అతిశయం తొణికిసలాడిందికూడా! తాతయ్యకే కాదు అమ్మమ్మకి కూడా మాలక్ష్మి అంటే ఇష్టమని అర్థమైంది నాకు. ఆడది మెచ్చిందే అందం అనుకున్నాన్నేను.

తరువాత అమ్మమ్మ తన మాటల్లో పెళ్ళంటే చేసుకోలేదుగానీ కడదాకా వాళ్ళిద్దరూ ఎంతగా కలిసిమెలిసి వున్నారో... వివరంగా చెప్పు కొచ్చింది.

మాలక్ష్మి పోయాకా తాతయ్య ఎంత ఒంటరివాడయ్యాడో అర్థమైంది నాకు. ఆలోచిస్తూ నేను పీటమీద మోకాళ్ళని దగ్గరగా ముడిచి, వాటిమీద 'నా గడ్డం ఆన్చుకుని మౌనంగా కూచున్నాను. వాళ్ళకాలంలో ఇంత సంక్లిష్టమైన విషయాలని ఇంత సజావుగా మామూలుగా ఎలా తీసుకున్నారన్నదే నాకింకా అంతుపట్టడంలేదు. బహుశా వారికిమల్లే నా జీవితంలో అంతగా ఆకర్షించిన పరిచయాలేవీ ఇంకా ఎదురుకాలేదేమో! అనుకున్నాను. అంతలో నాకు పతంజలి జ్ఞాపకానికొచ్చాడు. నేనూ, పతంజలీ యూనివర్సిటీలో సోషియాలజీలో రిసెర్చ్‌స్కాలర్లమి. నేనంటే చాలా ఇష్టపడేవాడు పతంజలి. పైగా నాతోపాటే రిసెర్చ్ చేస్తున్నవాడూ, బ్రాహ్మడూ కూడా గనక మా ఇంట్లోవాళ్ళంతా అతడిపట్ల సుముఖంగానే వుండేవారు. కానీ నాకు రెండేళ్ల జూనియర్ - రమేష్ అని ఒక నాయుళ్ళ కుర్రాడు వుండేవాడు. అతడు పతంజలి అంత తెలివైనవాడు కాదుగానీ చాలా చలాకీఅయినవాడు. ఆ అబ్బాయికీ నేనంటే ఇష్టముండేది. నేను కూడా పతంజలికన్నా రమేష్‌తోనే ఎక్కువ మాట్లాడేదాన్ని. అతడితోనే ఎక్కువ సమయం గడిపేదాన్ని. రమా రమా అని పిలిచేదాన్నతడిని. అనేక విషయాల్లో మేమిద్దరం కలగలసిపోగలిగేవాళ్ళం. అలాంటి సమయాల్లో పతంజలి ముభావంగా దూరంగా వుండేవాడు నాకు. పతంజలి అలా ఉడుక్కుంటూవుంటే చూడటం నాకు సరదాగా వుండేది. పతంజలిమీద నాకు ఆసక్తివున్నా - రమేష్‌తో నాకున్న స్నేహం... చనువూ మాత్రం పతంజలితో వుండేదికాదు. యూనివర్సిటీలోవాళ్ళు నేను పతంజలినో, రమేష్‌నో తప్పక పెళ్ళిచేసుకుంటానని ఊహాగానాలు చేస్తుండేవారు. అందరూ అనుకున్నట్టుగా నేను అటు పతంజలికిగానీ, ఇటు రమేష్‌కిగానీ పెళ్ళికోసం దగ్గరవలేదు. డాక్టరేట్ డిగ్రీ తీసుకుని ఉద్యోగం రాగానే ఢిల్లీ వెళ్ళిపోయాను పెళ్ళిచేసుకోమంటున్న ఇంట్లోవాళ్ళ వత్తిడినుంచి కొంతకాలమైనా తప్పించుకుందుకని.

నా ఆలోచనలకి అడ్డుకట్టవేస్తూ ... ''కాఫీ తాగుతావే అమ్మాయీ'' అంది అమ్మమ్మ. నన్ను కలపనివ్వదని తెలిసినా ... ''కాఫీ నేను కలపనా అమ్మమ్మా!'' అని అడిగాను నేను.

''ఎంతసేపే! ఈపాటిదానికి. నువ్వలా కూచో'' అనేసి నిజంగానే ం

రెండునిముషాల్లో నాముందు కాఫీకప్పు పెట్టింది అమ్మమ్మ. తరువాత లేచివెళ్ళి సావిట్లో ఉయ్యాలమంచంమీద కూచున్న తాతయ్యకి వేడివేడిగా చేసిన చంద్రకాంతాలని వెండిపళ్ళెంలో పెట్టి ఇచ్చి ... కాసేపు మాట్లాడుతూ అక్కడే నించుంది.

దూరాన్నించి వాళ్ళిద్దరినీ పరిశీలిస్తూ కూచున్నాను నేను. కోసుగా మెలితిరిగిన తెల్లని బుంగమీసాలు, తాతయ్య సగం బుగ్గల దాకా ఆవరించి వున్నాయి. అచ్చం ఆదిభట్ల నారాయణదాసు మీసాలకు మల్లేనే! తాతయ్యది వంకీలజుట్టు. మధ్య పాపిడి తీసుకుని తల దువ్వుకుంటాడు. సూదిముక్కు ముఖాని కంతటికీ ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. విశాలమైన ఆయన కళ్ళనించి చూపు తీక్షణంగా వుంటుంది. ఆయన కళ్ళలో నిరంతరం ఒక ఎర్రజీర మలిసంధ్యలా వ్యాపించి వుంటుంది. తాతయ్య చెవులకి కెంపుల తమ్మెట్లు అతుక్కుని వుంటాయి. తాతయ్యకి వేషంలోనేగానీ, వ్యవహారంలో మాత్రం ఏ కోశాన వైదిక సంప్రదాయాలేవీ అలవడలేదు. మిగతా వాటిల్లో ఆయన పూరా లౌక్యుడే. ఆయన ఖాళీ ఛాతీకి అడ్డంగా జంధ్యం వేళ్ళాడుతూ వుంటుంది. చిరుబొజ్జ... పంచెకట్టుని దాటి పైకి కన్పిస్తూ ఎర్రటి మొలతాడు. కూచుంటేనే అంత ఎత్తు కనిపించే ఆజానుబాహువాయన. ఏమేం జ్ఞాపకాలని నెమరువేసుకుంటాడో ... ఇంట్లో వున్నంతసేపూ ఏకాంతంలో వుంటాడు. వయసులో ఈయన సూదంటు రాయిలా ఆడవాళ్ళని ఆకర్షించేవుంటాడు అనుకున్నాన్నేను. నాకు తాతయ్య దగ్గిర బొత్తిగా చనువులేదు. ఎప్పుడన్నా పలకరిస్తే ఔననో.. అలాగేననో...సరేననో....జవాబుచెప్పి ఆయన ముక్తసరి ప్రశ్నలకి తలూపడం తప్పిస్తే... మాట పెగిలివచ్చేదికాదసలు. చేతికర్రని విలాసంగా ఊపుకుంటూ ఆయన వీధిలో నడిచివెడుతూ వుంటే ఆ ఊరి రైతులు ఎంతో మర్యాదతో ''బుగతా!'' అంటూ అనుసరించడం మేమంతా ఎరుగుదుం. బయటవాళ్ళందరికీ తలలో నాలుకలా మసలే ఆయన ఇంట్లో మాత్రం పరమ గంభీరంగా వుండేవాడు.

ఇంతలో అమ్మమ్మ తిరిగొచ్చి మళ్ళీ పొయ్యిదగ్గర కూచుంది.

''అమ్మమ్మా! తాతయ్య నిన్నెలా చూసుకునేవాడూ?'' అని అడిగాను.

దానికి నవ్వేసి ''ఒక మొగుడిలా ... ఇంకెలా?'' అనేసింది అమ్మమ్మ.

అమ్మమ్మ గొంతులో వ్యంగ్యమేంలేదు. విషాదమూ లేదు. చివరికి కొంచెం కోపాన్ని నా కంఠంలో పొలికిస్తూ ... ''నీకు మాలక్ష్మి గురించి తెలిస్తే ... నువ్వేమైనా అనుకుంటావనైనా ఆలోచించలేదా తాతయ్య?'' అన్నాను. అమ్మమ్మ నేనెంత కవ్వింపుచూపినా లొంగిరావడంలేదు నాకు.

''ప్రేమ వున్నచోట ఒకరు అనుకుంటారనీ, అనుకోరనీ ఆలోచించే అక్కర వుండదే! అది నాకు స్వానుభవంగా తెలుసు'' అంది అమ్మమ్మ. ''సరే విను. నేనూ, మీ తాతయ్య బాగా పరిచయస్థులమైన అపరిచయస్థులం అనుకో! ఆయనా, మాలక్ష్మి కలిసి ఒక ప్రపంచం. వాళ్ళ ప్రపంచాన్ని నేను అలాగే ఒప్పుకున్నాను. నేను అడ్డువెళ్ళదలచుకోలేదు.

గొడవ పడదలుచుకోనూలేదు. అదలా జరిగిపోయింది అంతే!'' అంది అమ్మమ్మ.

''ఇదంతా ఎలా సాధ్యమైంది అమ్మమ్మా! నీ త్యాగం వల్లనేగదా?'' అన్నాన్నేను 'త్యాగం' అన్న పదాన్ని వత్తిపలుకుతూ అక్కసుగా! ఎలాగైనా అమ్మమ్మలో ఒక కోపవీచికని చూడాలన్నది నా కోరిక.

''లేదమ్మా కమలా! నేను అడ్డుపడినా ... గొడవపడినా ... తాతయ్యని నా చుట్టూ తిప్పుకోలేను నేను. ఆయన మనసులో మాలక్ష్మి వుంది. నాకూ అక్కడ ఇంత చోటివ్వమని నేను ప్రాధేయపడదలచుకోలేదు. పోటీపడదలుచుకోలేదు. ఎందుకో చెప్పనా? నాకు శృంగారంమీదగౌరవం వుంది గనకనే!'' అంది అమ్మమ్మ.


నాకు ఈసారి నిజంగానే కోపం వచ్చింది. ''అంత సౌమ్యంగా ఎలా మాట్లాడగలుగుతున్నావ్? అదే నీకే ఇంకో సంబంధం వుంటే ... తాతయ్య నీ అంత విశాలంగా ఆలోచించి ఒప్పుకోగలిగి వుండేవాడా అమ్మమ్మా?'' అన్నాన్నేను - నా మనసులో పతంజలి ముభావం మెదలుతూండగా!

మా సంభాషణ అంతా ఏకాంతంలో మృదువుగా ... నెమ్మదిగా ... సాఫీగా సాగుతోంది. మా చుట్టుపక్కల ఏ అలికిడీ... ఆటంకమూ లేకనే ... ఆ సాయంత్ర వాతావరణం ... ఇద్దరాడవాళ్ళ అంతర్ లోకాల అల్లకల్లోల కెరటాన్వితమయ్యింది. పెరట్లో నూతిచప్టాపక్క వున్నాగ చెట్టు మీద పక్షుల కలకలం తప్ప మరే శబ్దమూ లేదు. ఈసారి నేనడిగిన ప్రశ్న అమ్మమ్మని కొంచెం కలవరపెట్టినట్టే వుంది. కొంత సమయం గడిచాకా ... నా ప్రశ్నకి అమ్మమ్మ ఇలా జవాబు చెప్పింది.

''తాతయ్య ఒప్పుకోవడం ... మానడం ... అన్నదానికన్నా ముఖ్యం అసలాయన దృష్టిలో ప్రేమ, శృంగారానుభవం వున్న సంగతులు కేవలం మగవాడికే సొంతమన్న అహంకారం తరచూ వ్యక్తమయ్యేది. అదే నాకు నచ్చని విషయం. సంసారంలోపలి ఆడవాళ్ళకీ శృంగారానుభవాలనేకం కలగగలవన్న ఆలోచనకే ఆయనలో చోటులేదు. అందునా వాళ్ళ వాళ్ళ సంసారాల్లోని ఆడవాళ్ళంటే ... వాళ్ళ దగ్గిర శృంగారపు ప్రసక్తే రాదసలు. అదొక నిషిద్ధ విషయం. జీవితమంతా నటించాల్సిందే వాళ్ళముందు వాళ్ళ ఆడవాళ్ళు!'' ఈ మాటని ఎంత మామూలుగా అందామనుకున్నా అమ్మమ్మ గొంతు తడబడింది. ఆమెకున్న నచ్చనితనం బలంగా వ్యక్తమయింది ఆ మాటల్లో!

నా ఆలోచనల్లోని లోపం కూడా నాకు కొట్టొచ్చినట్టు తెలిసింది ఈ మాటలతో. ఔను నిజమేకదా! నేను మాత్రం? ఇంతసేపూ తాతయ్యకి మాలక్ష్మితో వున్న సంబంధం గురించే ప్రశ్నించానుగానీ ... నా అనుభవాల గురించే ఆలోచించుకుంటున్నానుగానీ ... ఎక్కడా అమ్మమ్మ జీవితంలో కూడా ఆవిడకే సొంతమైన కొన్ని అపురూప అనుభవాలుండొచ్చునేమో!?! అన్న ఊహకి కూడా పోలేదుకదా! అనుకున్నాను... తప్పుచేసినట్టు.

నేను మరేవీ ప్రశ్నించకుండానే నా సందిగ్ధతలన్నీ తాను చదివినట్టుగానే నా ముఖంలోకి చూస్తూ ''గాఢమైన శృంగారానుభవం కలిగితే జీవితంలో సమతుల్యత దానికదే సాధ్యమవుతుందే మనవరాలా!'' అంది అమ్మమ్మ నామీద ప్రేమ ఉట్టిపడే గొంతుకతో. ''అలాంటి అనుభవాలు నాకున్నాయి గనకనే నేను మీ తాతయ్య శృంగారజీవితపు లోతులని అర్థంచేసుకోగలిగేను. ఎప్పుడని, ఎవరని, ఎలాగని ప్రశ్నించకు. కథలు అనేకం. ఎవరి అనుభవం




వారిదే!'' అంది మళ్ళీ. అంతదాకా లేని గాఢత ఒకటి అమ్మమ్మ మాటల్లో వ్యక్తమయింది.

వివరంగా చెప్పమని బతిమాలి అడిగాను నేను.

అమ్మమ్మ తనకోసమే మాట్లాడిందో ... నాకోసమే మాట్లాడిందో కూడా నాకు తెలీదుగానీ ... ఏనాడూ నాతో మాట్లాడనంత నిగూఢంగా మాత్రం మాట్లాడింది. ఆవిడ అనుభవాన్ని ఆవిడ మాటల్లోనే జ్ఞాపకం పెట్టుకున్నాను నేను.

''నా పెళ్ళయ్యాకే! మా పుట్టింట్లో ... నాకు మీ అమ్మ పుట్టిన తరువాత ... ఆదిరాజువారి కుర్రాడు మా ఇంట సంస్కృతాధ్యయనానికొచ్చిన కుర్రాళ్ళందరిలోనూ చురుకైనవాడు. ఎవరినీ ఒక పట్టాన మెచ్చుకోని మా పెదతాతగారు సైతం మణిపూసలాంటివాడని ప్రత్యేకంగా అభిమానించేవారు తెలుసా?'' అంటూ తనలో తాను మాట్లాడుకుంటున్నంత నెమ్మదిగా మాట్లాడింది అమ్మమ్మ.

''వయసులో నాకన్నా కొంచెం చిన్నవాడే అనుకుంటాను. ఎంతటి ధీమంతుడో ... చురుకైనవాడో చెప్పలేను నేను...'' ఈ మాటలంటున్నప్పుడు అమ్మమ్మ పెదవి కొనల్లో మెరిసిన నునుసిగ్గు హొసరేఖని సరిగ్గా అందుకోగల చిత్రకారులున్నారో లేరో నాకు తెలీదుగానీ నేను మాత్రం ఆ క్షణంలో ఆవిడలోని ఆ హఠాత్ సౌందర్యాన్ని నా చూపుతో పట్టుకుని భద్రపరచుకున్నాను. నేను మరే ప్రశ్నలు వేయనక్కరలేనంత వివరంగా అమ్మమ్మ తన ప్రణయాన్ని నాముందు రేకురేకుగా విప్పి చెప్పింది.

''శృంగారస్పర్శ చాలా బలమైనదే అమ్మాయీ! ఇవ్వాల్టిదాకా నేనతడి స్పర్శని మరిచిపోలేదు సుమా! అందునా ఆ కార్తీకమాసపు తెల్లారగట్ట ... ఏటిగట్టున ... ఆకాశంకింద ... శుక్రుడి సాక్షిగా ఏకమైన దేహాలమధ్య ఎంతటి తీవ్ర శృంగారకలాపం అదీ?!! జన్మానికంతకీ వెన్నెతెచ్చిన అనుభవం అది మా ఇద్దరికీనూ'' అంది కన్నులరమోడ్పుగా అమ్మమ్మ. ''రెండు జ్వాలలు పెనవేసుకుని వెలిగినట్లనుకో! ప్రసూనమాలలా శరీరాలు అవ్యక్త సుగంధాలని వెదజల్లే కామమే నిజమైన కామం. దానికి దోసిలిపట్టాలి ... ఎదురెళ్ళి దాసోహమనాలి. ఆ స్థితిలో ఈ లోకంలో చెలామణీఅయ్యే మతాలకీ, ధర్మాలకీ, శాస్త్రాలకీ ఏ విలువా లేదు. అదొక రసఝురీయోగం అంతే!! కావ్యానుభవాన్ని అక్షరాలుగా పఠించడంకన్నా అణువణువులోంచి గ్రహించడం అన్నదే ఎక్కువ విలువైనదన్న విషయం నాకు ఆ రాత్రే తెలిసింది. ఆ తరువాత మరి నేను సంస్కృత కావ్యాలమీద

మునుపటి మోహాన్ని వదిలేసుకున్నాను. కావ్యాన్ని చదవడంకన్నా కావ్యంగా మిగలటం మరీ మధురం'' అంది అమ్మమ్మ మరీ మధురంగా!!

నేను విభ్రమతో మిగిలాను. నా లోపల అపరిష్కృతమైన అనేక ప్రశ్నలకి జవాబు దొరికినట్లయ్యింది. అప్పటిదాకా నాకెదురైన శృంగారానుభవాలన్నీ తిరగదోడుకుని ఆలోచించుకున్నాను. ఎందుకనోగాని ''ప్రేమ'' అన్న భావంలోనో ... శృంగారపు గాఢతలోనో నేను ఇంతదాకా నిజంగా సంలీనమయ్యానన్పించలేదు నాకు. అసలీ భావాలు స్థిరమనీ ... శాశ్వతమనీ కూడా నేననుకోలేదు.

ఏదో వెలితి. చాలా చదువుకున్న తర్వాత కూడా - ఏ విజ్ఞానమూ నా లోపలి శూన్యాలని పూడ్చలేని వెలితి తాలూకు కొస అంచులేవో ఇప్పుడు అమ్మమ్మ మాటల్లో దొరుకుతున్నట్లే అన్పించింది నాకు. మేము శృంగారాన్ని జీవితంలో ఒక భాగంగా భావించి అనుభవించేమేమోగానీ, దాన్ని మా లోపలి మసకచీకట్లని వెలిగించుకోగల దీపశిఖగా ప్రజ్వలింపచేసుకోలేకపోయామా? అనుకున్నాను. ఇలా చదువులవెంటా, ఉద్యోగాలవెంటా, పేరు ప్రఖ్యాతుల వెంటా ప్రపంచాలు తిరుగుతూ పరుగులుపెట్టే తొందరలో ప్రాణాధారమైనవాటినెన్నో జారవిడుస్తున్నామా? అనికూడా అనుకున్నాను. నాలో ఎంతకీ వదలని అసంతృప్తుల ఆదిమూలాలేవో అమ్మమ్మ ఇలా చెప్పకనే చెప్పి నన్ను మేల్కొలిపిందా? ఏమిటి కావాలి నాకు? ఎందుకీ భయాలు నాలో? వేటి గురించి? ఇంత అనుభవం తర్వాత కూడా??!

వెన్నెల్లో పడుకుని ఆలోచిస్తూ చాలాసేపు ఒంటరిగా మిగిలిపోయాను.

ఎప్పుడో తాతయ్య నిద్రపోయిన తరువాత నా పక్కనే వచ్చి నిశ్శబ్దంగా పడుకుని నా తల నిమురుతూ ... నా భయాలన్నీ తనకి తెలుసన్నంత నమ్మకంగా నన్ను దగ్గరికి తీసుకుంది అమ్మమ్మ. ఎక్కడా దొరకని విశ్రాంతి - అమ్మమ్మ గుండెల్లో మొహం దాచుకుంటే దొరికింది నాకు. నా వీపుమీద చేయి వేసి రాస్తూ ... చెవిలోగుసగుసగా అమ్మమ్మ నాతో మాట్లాడిన ఒక్కొక్క మాటా నేను మరిచిపోలేనివి.


మా అమ్మమ్మ రసోచిత వ్యక్తిత్వం వెనక దృశ్యాదృశ్యంగా తారాడే ఆయనెవరో తెలుసుకోవాలన్న కోరికని అణచుకోలేకపోయాను. ఇంక నిద్రలోకి జారుకోబోయే క్షణాన ... చివరికి చొరవచేసి ... ''అమ్మమ్మా! ఆ ... ఆదిరాజువారి కుర్రాడూ ...'' అంటూ అర్థోక్తిలో ఆగిపోయాన్నేను.

చిక్కటి చీకట్ల మధ్య, పాలపుంతవైపు తలతిప్పి చూస్తూ ... తన చూపులో నక్షత్రాలు ప్రతిఫలిస్తుంటే ... ''నీలకంఠశాస్త్రి'' అంది అమ్మమ్మ!

మా మావయ్య పేరు ఎవరిదో అప్పటికి నాకు అర్థమైంది.


లైంగిక బలహీనతా?
విచారించకండి.

చిన్న తనంలో అసాధారణ చర్యలవల్ల వయస్సు పైబడినట్లు లేదా శారీరక బలహీనత లేదా నరముల బలహీనత మొ. వాటికి వెంటనే డా. రాణాగజి, సెక్స్ స్పెషలిస్టను (ప్రభుత్వ రిజిస్టర్డ్) సంప్రదించండి



నేడే విచ్చేసి ప్రత్యేకమైన ట్రీట్‌మెంట్‌తో శక్తిని అధికం చేసుకోండి.
సమర్థవంతమైన వైద్యంతో అతని సామర్థం తెలుసుకోండి.

సంప్రదించు వేళలు ఉ.9.00 గం. నుండి మ. 1.00 గం.వరకు సా. 5.00 గం.నుండి 8.30 వరకు

రాణా డిస్పెన్సరి

మొదటి అంతస్తు నెం.3-4-692/సి, (ఆజమ్ సప్లయింగ్ కంపెని బిల్డింగ్ ప్రక్కన)
నారాయణగూడ చౌరస్తా, బర్కత్‌పురా రోడ్, హైదరాబాద్, ఫోన్: 7566353